క్లుప్తంగా

పాక్కూరులో కార్డెన్ సెర్చ్



పట్టుకున్న నాటుసారా, బెల్లం పానకం

చెన్నూర్‌రూరల్: మండలంలోని పాక్కూరు గ్రామంలో చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్ రావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 50 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు సీజ్ చేశారు. నాటుసారా స్థావరాలు గుర్తించి వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 20లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సుబ్బారావు, పోలీసు సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జడ్జి పి.రవి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం చెన్నూర్ మున్సిఫ్ కోర్టు సివిల్ జడ్జి పి.రవి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంబాబు, చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్‌రావు, ఎస్సై సుబ్బారావు, పాఠశాల హెచ్ఎం సత్యారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వనంలోని మొక్కలు సంరక్షించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీవో బాపురావు

జైపూర్: పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను సంరక్షించాలని ఎంపీవో శ్రీపతి బాపురావు పేర్కొన్నారు. మండలంలోని పెగడపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని సూచించారు. గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. నర్సరీ మొక్కలు హోమ్ స్టెడ్ ప్లాంటేషన్ కింద గృహాలకు పంపిణీ చేయాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని గ్రామంలో ఘనంగా నిర్వహించాలన్నారు. తాగునీటి వాటర్ ట్యాంకులను పరిశీలించారు. క్లోరినేషన్ చేయించి శుభ్రమైన నీటిని మాత్రమే సరఫరా చేయాలన్నారు. అనంతరం పంచాయతీ రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పావని, సిబ్బంది ఉన్నారు.

నేడు మడేలేశ్వర స్వామి బోనాల జాతర

పాతమంచిర్యాల: ఏటా నిర్వహించే రజకుల ఆరాధ్యదైవమైన మడేలేశ్వర స్వామి బోనాల జాతర జిల్లా కేంద్రంలో శనివారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు రజక సంఘం పట్టణ అధ్యక్షుడు పారిపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ పోషం అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బోనాల జాతరకు రజకులు ప్రతీ కుటుంబం నుంచి స్వామికి బంగారు బోనంతో ఉదయం 11గంటలకు విశ్వనాథ ఆలయం వద్దకు చేరుకోవాలని, అక్కడి నుంచి మడేలేశ్వర ఆలయం వరకు బోనాలతో ఊరేగింపుతో మడేలేశ్వర ఆలయం వద్ద పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొంటున్నారని, పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు నేరేళ్ల రమేశ్, కండె కృష్ణ, నల్లూరీ మల్లయ్య పాల్గొన్నారు.

30 సార్లు రక్తదానం



రక్తదానం చేస్తున్న గణేశ్

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన నటరత్న యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గాండ్ల గణేశ్ శుక్రవారం మంచిర్యాల జననీ బ్లడ్ బ్యాంకులో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేయడం 30వ సారి అని యూత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బొమ్మెన మహేష్, గరిగె నర్సయ్య తెలిపారు.



అటవీనర్సరీలో ఎండిన మొక్కలు

భీమారం మండల కేంద్రం సమీపంలోని అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలో మొక్కలు ఎండిపోతున్నాయి. రిజర్వుఫారెస్ట్‌లో ప్లాంటేషన్ చేసేందుకు అవసరమయ్యే వివిధ జాతుల మొక్కలను రెండు నర్సరీల్లో పెంచుతున్నారు. కొన్ని విత్తనాలు నాటి పెంచుతుండగా, మరికొన్ని నారు దిగుమతి చేసుకొని ఉత్పత్తి చేస్తున్నారు. ప్లాస్టిక్ ట్యూబ్‌లో పెంచుతున్న ఈ మొక్కలకు సరైన ఎరువుతో పాటు నీటిని అందించకపోవడంతో అవి ఎండిపోయినట్లు సమాచారం. మొక్కలు ఏ లోపంతో ఎండిపోయాయనేది అధికారులు విచారణ జరపాల్సి ఉంది. - భీమారం

మోడువారినా అందమే



వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు మట్టి కట్ట కింద మామడ ఊరు పక్కన ఎండిపోయిన ఇప్ప చెట్టు అందంగా కనువిందు చేస్తోంది. అటుగా వెళ్లే బాటసారులను ఆకట్టుకుంటుంది.



అపరిశుభ్రంగా ఎంపీడీవో కార్యాలయం..!

మందమర్రి ఎంపీడీవో కార్యాలయం ఆవరణ అపరిశుభ్రంగా ఉంది. పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులు సంచరిస్తున్నాయి. నాలుగు నెలల క్రితం నిర్మించిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌లో శుభ్రం చేసిన పాత్రల వృథా నీరు కార్యాలయ ఆవరణలోనే నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. పందులు సంచరిస్తున్నా యి. పబ్లిక్ టాయిలెట్లు కూడా లేకపోవడంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు, సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. - మందమర్రిరూరల్

ఇసుక ధరలకు రెక్కలు



ఇటీవల అధికారులు పట్టుకున్న ఇసుక కుప్పలు

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో డిమాండ్

జన్నారం: తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో ఇసుకాసురులకు పంట పండుతోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఊపందుకోవడంతో ఇసుక ధరలకు రెక్కలొస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఇసుక ధరలతో సామాన్యుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

అమాంతం పెరిగిన ధరలు..

ఇసుకకు గతంలో ట్రాక్టర్‌కు రూ.600 ఉండేది. అవసరాలు పెరిగిపోవడంతో అమాంతంగా ధర డబుల్ అయింది. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక ధర రూ.1000 నుంచి రూ.1800వరకు తీసుకుంటున్నట్లు ఇందిరమ్మ లబ్ధిదారులు పేర్కొంటున్నారు. జన్నారం మండలంలో అత్యధికంగా బాదంపల్లి, తిమ్మాపూర్, రాంపూర్, పొనకల్ గ్రామాల నుంచి ట్రాక్టర్ యజమానులు ఇసుకను తరలిస్తారు. సమీప వాగులు, గోదావరి తీరాల నుంచి ఇసుకను తోడుతున్నారు. నిత్యం వందల ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

ఎమ్మెల్యే సీరియస్..

ఇసుక కొరత సృష్టించి, ధరలు పెంచడంపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సీరియస్‌గా తీసుకున్నారు. ఇసుక ధరలు పెంచడం, కొరత ఏర్పడంతో ఇసుక వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జన్నారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే దృష్టికి పలువురు ఇందిరమ్మ లబ్ధిదారులు ఇసుక ధరల గురించి వాపోవడంతో సీరియస్ అయ్యారు. గ్రామాల్లో పర్యటించి, ఇసుక నిల్వలను సీజ్ చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ క్రమంలో బాదంపల్లి గ్రామంలో రెవెన్యూ అధికారులు 168ట్రాక్టర్ల ఇసుక నిల్వలను సీజ్ చేశారు. మరిన్ని గ్రామాల్లో కూడా రెవెన్యూ అధికారులు దాడులు చేసే అవకాశం ఉంది. ఈ విషయంలో అధికారులు దృష్టి సారించి ఇసుక ధరలు అందుబాటులోకి తేవాలని మండలవాసులు కోరుతున్నారు.

ఉచిత ఇసుక సరఫరాకు ప్రయత్నం



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక పంపిణీ చేసేందుకు కృషి చేస్తాను. ధరలు పెంచి, వ్యాపారం చేయాలనుకుంటే తగిన చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా, అనధికారికంగా ఇసుక నిల్వలు ఉంచి, ఇసుక రవాణా చేస్తే ఊరుకోం. ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధర లేదా, ఉచితంగా ఇసుక పంపిణీ చేయడానికి తగిన ప్రణాళిక రూపొందిస్తున్నాం.

- వెడ్మ బొజ్జు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే

నిరాహార దీక్షలకు పెరుగుతున్న మద్దతు



దీక్షలో పాల్గొని మాట్లాడుతున్న నాయకులు

జన్నారం: జన్నారం మీదుగా భారీ వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సామాజిక వేత్త శ్రీరాముల భూమాచారి చేపట్టిన రిలే నిరహార దీక్షలకు మద్దతుగా బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్ ప్రతీరోజు పాల్గొంటుండగా, శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, మైనారిటీ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. టైగర్ జోన్ పేరుతో పగటిపూట కూడా భారీ వాహనాలను జన్నారం మీదుగా అనుమతించకపోవడంతో మండల వాసులు ఎంతో నష్టపోతున్నారని పేర్కొన్నారు. వ్యాపారం నష్టపోవాల్సిన వస్తుందన్నారు. వెంటనే భారీ వాహనాలను పగలంతా రాకపోకలను అనుతించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఆందోళనలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చింతగూడ వైస్ చైర్మన్ కమ్మల విజయ ధర్మా, బీఆర్ఎస్ నాయకులు జనార్దన్, ఫజల్ ఖాన్, భరత్‌కుమార్, శంకర్, ఎల్లయ్యతో పాటుగా మైనారిటీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.5.28 లక్షలు

చెన్నూర్: పట్టణంలోని మదన పోచమ్మ ఆలయ ఆవరణలో అమ్మవారికి హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం వేలాల కార్యనిర్వహణాధికారి రమేశ్ సమక్షంలో లెక్కింపు నిర్వహించారు. హుండీ నగదు రూ.5,28,347, మిశ్రమ బంగారం 3గ్రాములు వచ్చినట్లు మదన పోచమ్మ అధికారి ముక్త రవి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పీఐవోను నియమించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్టీఐ దరఖాస్తులను స్వీకరించడానికి సింగరేణి యాజమాన్యం పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి(పీఐవో)ని నియమించాలని హెచ్ఎమ్మెస్ కేంద్ర కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, బ్రాంచీ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, నాయకులు సాయికృష్ణా రెడ్డి, సంపత్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో పనిచేసిన డీజీఎం చనిపోవడం, ఆయన తరువాత ఆ స్థానంలో ఉండే ఏపీఐవో అధికారి కూడా బదిలీ కావడంతో ఈ రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు. పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

గోరింటాకు సంబురాలు

మంచిర్యాలటౌన్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గర్మిళ్లలో మహిళలు గోరింటాకు సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. వార్డు మహిళ అర్కల హేమలత ఆధ్వర్యంలో 200మంది మహిళలు ఒక్కచోట చేరి, గోరింటాకు పెట్టుకున్నారు. గాజులు, పసుపు కుంకుమ, పూలు ఒకరికొకరు ఇచ్చుకున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కోటపల్లి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కోటపల్లి సీఐ బన్సీలాల్ పత్రిక ప్రకటనలో తెలిపారు. కోటపల్లి, నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ ఇసుక, పీడీఎస్ రైస్, గుడుంబా రవాణా, గంజాయి అమ్మకం సేవించడం వంటి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్‌లు నమోదు చేస్తామని హెచ్చరించారు.



స్పందించారు.. మరమ్మతు చేయించారు

సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి: మిషన్ భగీరథ పథకం నీటి సరఫరా నిలిచిపోయిన వైనంపై 'సాక్షి ' దినపత్రికలో 'భగీరథ నీళ్లు బంద్' శీర్షికన శుక్రవారం వార్తాకథనం ప్రచురితం కాగా ప్రభుత్వ అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ బెల్లంపల్లి పట్టణ ఏఈ శ్రీనివాస్ తమ శాఖ సిబ్బందితో పాటు, ప్రైవేట్ సోలార్ కంపెనీ సిబ్బందిని రప్పించి జేసీబీతో గుంత తీయించి పైపులైన్‌కు మరమ్మతు చేయించారు. అడ్డంకిగా ఉన్న స్తంభాన్ని తొలగించి, పక్కన ఏర్పాటు చేయించి తాగునీటి సరఫరాను యథాతథంగా పునరుద్ధరించే చర్యలు తీసుకున్నారు.

పిచ్చిమొక్కలు, చెత్త తొలగింపు



మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధి పాతమంచిర్యాలలోని 'పార్కు నిర్వహణ అధ్వానం'గా ఉందని ఈ నెల 15వ తేదీన 'సాక్షి'లో వచ్చిన కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులను కేటాయించి, వాకింగ్ ట్రాక్‌పై పెరిగిన పిచ్చి మొక్కలు, పార్కు ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించే పనులను ప్రారంభించారు. రెండు మూడు రోజుల్లోపు పార్కును ఆహ్లాదకరంగా మార్చేలా పనులు చేపడుతున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం ప్రదర్శించొద్దు

- డీఎల్‌పీవో సబ్దర్‌ఆలీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సబ్దర్‌ఆలీ

తాండూర్: వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించొద్దని బెల్లంపల్లి డీఎల్‌పీవో సబ్దర్‌ఆలీ అన్నారు. మండలంలోని తాండూర్ నర్సాపూర్ గ్రామపంచాయతీలో శుక్రవారం స్థానిక అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శులు దివాకర్, జగదీష్ ఉన్నారు.

పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

భీమారం: పల్లెల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ కార్యదర్శి గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పరిస్థితులు గమనించాలని సూచించారు. ఎంపీవో సతీశ్ రెడ్డితో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికుల అపూర్వ సమ్మేళనం



గనిపై కలుసుకున్న రిటైర్డ్ కార్మికులు

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిలో కార్మికుల అ'పూర్వ' సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గనిలో పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికులంతా శుక్రవారం తిరిగి కలుసుకున్నారు. ట్రామర్లు, హాలర్ ఆపరేటర్లతో పాటు పలు డిపార్టుమెంట్‌లకు చెందిన వారంతా కలిసి, నాడు గనుల్లో తాము పనిచేసిన సమయంలో కలిసి మెలిసి ఉన్న తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పనిలో తాముపడ్డ శ్రమను, నాటి రోజుల్లో గనుల్లో ఉన్న సదుపాయాలను, నేడు ఉన్న వాటిని పోల్చుకుంటూ జ్ఞాపకాలు పంచుకున్నారు. గనిపైనే విందు ఏర్పాటు చేసుకొని సంబురాలు జరుపుకున్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని మేనేజర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గని మేనేజర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గనిపై ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో ఏఐటీయూసీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గనికి చెందిన 20మంది కార్మికులు ఏఐటీయూసీ యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, బ్రాంచి అసిస్టెంట్ సెక్రెటరీ దాసరి తిరుపతి, నాయకులు నర్సయ్య, వెంకటేశ్, వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

'న్యాయం చేయండి'

నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లి సర్వే నంబర్ 6 లోని 38గుంటల భూమిని కొందరు వ్యక్తులు తమ ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, తమ భూమి ఇప్పించాలని విలేజ్ నస్పూర్‌కు చెందిన వెంకటనర్సింహా చార్యులు, పద్మజ, సత్యానారాయణ చార్యులు వేడుకున్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ఈ విషయమై మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. అనంతరం మంచిర్యాల మాజీ ఎంపీపీ, మాజీ కౌన్సిలర్ బేర సత్యనారాయణ మాట్లాడుతూ.. ధర్ని మధూకర్ శ్రీనివాసాచార్యుల వారసులు వస్తే ఆ భూమిని తిరిగి ఇస్తానని చెప్పారని, శ్రీనివాసా చార్యుల వారసులకు భూమిని తిరిగి ఇచ్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. సమావేశంలో శ్రీనివాసాచార్యుల వారసులు సుశీలదేవి, శోభారాణి, గోదాదేవి పాల్గొన్నారు.

కార్యదర్శులకు అవగాహన



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై మండల స్థాయి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతిపై ఉన్న ప్రశ్నావలిని వివిధ శాఖల సహకారంతో పంచాయతీ కార్యదర్శులు రెండు రోజుల్లో సేకరించి సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్‌అలీ, ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల సమస్యలు తీర్చాలి

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.చక్రపాణి, జి.రాజవేణు డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ కళాశాలలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బబిత, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్, తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మార్క్స్‌భవన్‌లో ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు అవగాహన

లక్సెట్టిపేట/జైపూర్/దండపల్లి మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో క్రమశిక్షణ, బాలికలపై జరుగుతున్న అరాచకాలు, బాలకార్మికులు, డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు, లక్సెట్టిపేట పట్టణంలోని సీఎస్ఐ గ్రౌండ్‌లో యువతకి లక్సెట్టిపేట పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. జైపూర్ కేజీబీవీ బాలికల పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, ఎస్సై సురేశ్ పాల్గొన్నారు.

పోలీసుల విలేజ్ విజిటింగ్

జన్నారం: విలేజ్ విజిటింగ్‌లో భాగంగా శుక్రవారం లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై గొల్లపెల్లి అనూష మండలంలోని బంగారు తండా, హాస్టల్ తండా గ్రామపంచాయతీల్లో పర్యటించారు. బంగారు తండాలో ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని చట్టపరమైన సహకారం అందిస్తామని తెలిపారు. హాస్టల్ తండాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

కిష్టంపేటలో డ్రై డే

చెన్నూర్‌రూరల్: డెంగీని నివారించడంలో డ్రై డే ముఖ్యపాత్ర పోషిస్తుందని హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలో శుక్రవారం చేపట్టిన డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. సబ్ యూనిట్ అధికారి జగదీశ్ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ఇంటింటి డ్రై డే చేపట్టారు.